సాక్షి నిర్మల్

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



డ్రైవర్.. దొంగ! IIలో▸

సెల్ఫ్ వాహనాలు అద్దెకు తీసుకొని అందిన కాడికి దోచే ఘరాన మోసగాడిని ఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వెల్లడించారు.



విజృంభిస్తున్న జ్వరాలు IIIలో▸

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలతోపాటు సాధారణ జ్వరాల బారిన పడుతూ ప్రజలు అల్లాడుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతు పవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

చెరువుల గోసపై కదలిక

- 'సాక్షి' వరస కథనాలకు స్పందన..
- జిల్లా కేంద్రంలో ఆక్రమణల తొలగింపు
- చిన్నరాంసాగర్‌లో అధికారుల చర్యలు
- నిర్మాణాల తొలగింపు.. కందకం తవ్వకం
- మిగతావాటినీ పట్టించుకోవాలంటున్న స్థానికులు



చిన్నరాంసాగర్ చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

నిర్మల్: నిర్మల్ గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ విషయంలో అధికారుల్లో కదలిక మొదలైంది. ఆక్రమణలను అడ్డుకోవాలని చెరువులు పెడుతున్న గోసపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. మరోవైపు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు చెరువులను పరిశీలించడంతోపాటు కలెక్టర్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక ఇటీవల 'సాక్షి' రాసిన కథనాలపై ఉన్నతాధికారులు ఎట్టకేలకు స్పందించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్‌తోపాటు ఇరిగేషన్, మున్సి పల్, రెవెన్యూ అధికారులు స్పందించారు. లేక్ కమి టీ మీటింగ్ నిర్వహించారు. ఇందులో తీసుకున్న ని ర్ణయాల మేరకు గురువారం చర్యలు ప్రారంభించా రు. స్థానిక మంజులాపూర్ చిన్నరాంసాగర్ చెరువులో అక్రమంగా చేపట్టిన నిర్మాణాల తొలగించారు.

చెరువులు చెరబట్టి..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిర్మల్ జిల్లాకేంద్రంలో చారిత్రక గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. పదికిపైగా ఉన్న ఈ చెరువులతోనే జిల్లాకేంద్రం వందల ఏళ్లుగా సుభిక్షంగా ఉంది. పట్టణం చుట్టూ ఉన్న ఈ చెరువుల కారణంగా ఇప్పటికీ ఇక్కడ భూగర్భ జలాల పుష్కలంగా ఉన్నాయి. అలాంటి చెరువులను కొన్నేళ్లుగా ఆక్రమిస్తూ వస్తున్నారు. పాలకులు, అధికారులు, పార్టీల నేతలు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇప్పటికే చాలా వరకు చెరువు భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నిర్మల్ జిల్లా కావడం, పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో స్థానికంగా భూముల విలువలు పెరిగాయి. ఇవే చెరువులపాలిట శాపంగా మారాయి. పట్టణంలో ఒక్కోప్లాటు ధర రూ.40 లక్షలకుపైగా ఉండటంతో కబ్జాదారులు చెరువుల శిఖాలు, ఎఫ్‌టీఎల్‌పై కన్నేశారు. వీరికి కొంతమంది పాలకులు, అధికారుల అండ ఉండడంతో అడ్డూ



ఎన్టీఆర్‌మార్గ్ వైపు హద్దుగా తవ్వుతున్న కందకం

అదుపు లేకుండా చెరువుల మధ్య వరకూ చొచ్చుకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. జలాశయాల హద్దులను చెరిపేసి ఇష్టానుసారంగా ఫెన్సింగ్ వేశారు.

అమాయకులకు అంటగట్టి..

తాము ఆక్రమించిన చెరువు భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు చేయడంతోపాటు అమాయకులకు అక్కడ ప్లాట్లను సైతం అంటగట్టారు. చెరువు భూముల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని ఉన్నత న్యాయస్థానాల నుంచి స్పష్టమైన తీర్పులు ఉన్నాయి. ఇవేవీ తెలియని అమాయక జనాలు తక్కువ ధరలకు వస్తున్నాయన్న ఆశతో కబ్జాదారుల వద్ద ప్లాట్లు కొని.. ఇప్పుడు మోసపోయామని బాధపడుతున్నారు. ప్రియదర్శిని నగర్ ప్రాంతంలోని చిన్నరాంసాగర్ చెరువు చుట్టూ చాలామంది కబ్జాదారులు అమాయకులకు నిషేధిత భూముల్లో ప్లాట్లను అంటగట్టారు. ఇక పట్టణం మధ్యలో ఉన్న చెరువుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. నలుదిక్కుల ఆక్రమణల జోరుతో చిన్నబోతున్నాయి. ప్రస్తుతం అలాంటి



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

భూముల్లో ప్లాట్లు, నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టడంతో సదరు బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి భూములను ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేయవద్దని జిల్లా అధికారులు సూచిస్తున్నారు.

'సాక్షి' వరుస కథనాలు..

నిర్మల్ జిల్లాకేంద్రం ఎప్పటికీ కరువుకాటకాల బారిన పడకూడదంటే గొలుసుకట్టు చెరువులు ఉండాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా 'గొలుసుకట్టు తెగేట్టు.. చెరువు.. కాపాడేదెవరూ..! కోర్టు తీర్పులూ పట్టవా..? గొలుసుకట్టు గోస..' వినరా అంటూ 'సాక్షి' దినపత్రిక వరుస కథనాలను ప్రచురిస్తోంది. ఈ చెరువులను చెరిపేస్తే నిర్మల్ భవిష్యత్తు ఉండదన్న నేపథ్యంలో ప్రచురించిన ఈ కథనాలపై ఇటీవల జిల్లా కలెక్టర్‌గా నియమితులైన అభిలాష అభినవ్ స్పందించారు. అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇరిగేషన్ జిల్లా అధికారి లక్ష్మి తదితర శాఖల అధికారులతో కలిసి ఇటీవల 'లేక్ కమిటీ' మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు చర్యలు ప్రారంభించారు.

ఎట్టకేలకు కదలిక...

గొలుసుకట్టు చెరువులు పెడుతున్న గోసపై జిల్లా అధికారుల్లో చలనం మొదలైంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం స్థానిక ప్రియదర్శినినగర్ ఎన్టీఆర్ మార్గ్‌లోని మంజులాపూర్(చిన్న రాంసాగర్) చెరువులో చేపడుతున్న నిర్మాణాలు, ఆక్రమణలపై చర్యలు ప్రారంభించారు. చెరువు భూముల్లో చేపడుతున్న నిర్మాణాలతోపాటు పలు ప్లాట్లను తొలగించారు. రోడ్డు పొడవునా మట్టి వేసి, ప్లాట్లుగా చదును చేసిన ప్రాంతంలో చిన్నకందకం తవ్వించారు. ఇందులో ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు గతంలోనూ కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడ ఫెన్సింగ్ చేసినప్పటికీ మళ్లీ ఆక్రమణలు చేశారని, ఈసారి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, అలాగే చెరువుల చుట్టూ ఉన్న మిగతా ఆక్రమణలపైన దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కంటితుడుపు చర్యలు వద్దు..



నిర్మల్ గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ కోసం హైకోర్టు స్పష్టమైన తీర్పును ఇచ్చింది. ఈ మేరకు చెరువుకట్ట మినహా మూడువైపులా పకడ్బందీగా ఫెన్సింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే కోన్‌స్టోన్ సరిహద్దులను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం జిల్లా అధికారులు చర్యలు ప్రారంభించడం హర్షనీయం. కానీ కంటితుడుపు చర్యలతో సరిపెట్టకుండా కోర్టు తీర్పుల ప్రకారం శాశ్వత పరిష్కారం చేపట్టాలి.

– అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

గ్రామాల్లో పర్యటించిన డీపీవో



క్లోరినేషన్ చేయిస్తున్న డీపీవో

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్, సత్తన్‌పల్లి గ్రామాల్లో గురువారం డీపీవో శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు శానిటేషన్ పనులు, రికార్డులు పరిశీలించారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించడంతోపాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్ రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఇలేగాం, మిర్జాపూర్ సమీపంలోని పోలీస్ బెటాలియన్‌లో గురువారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవంలో పండ్ల మొక్కలకే ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలోని డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య, ఈసీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కృతజ్ఞత సభ

నిర్మల్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమావేశం కానున్నారు. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కానుంది. దీని కోసం జిల్లా నుంచి ప్రమోషన్ పొందిన సుమారు 500 మంది ఉపాధ్యాయులను తరలించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వీరందరికీ శుక్రవారం వేకువజామున నియోజకవర్గ కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులు బయల్దేరుతాయి. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్, వాటర్ బాటిల్, బస్సు టికెట్లు ఉచితంగా అందించనున్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి సభను సక్సెస్ చేయడానికి రెండు రోజులుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేశారు. ప్రమోషన్లు వచ్చిన ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరుకావాలని జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి సూచించారు. తమకు న్యాయం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభకు తప్పకుండా వెళ్తామని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక వైద్యులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ సుమల ఎండీ జనరల్ మెడిసిన్, డాక్టర్ సురేందర్ ఎంఎస్ జనరల్ సర్జన్, డాక్టర్ విజయానంద్ డీసీహెచ్ (పీడియాట్రిస్ట్)గా బాధ్యతలు చేపట్టారు. రోగులు ప్రత్యేక వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

చెరువు శిఖం ఆక్రమిస్తే చర్యలు



గంజాల్ చెరువును సర్వే చేస్తున్న అధికారులు

సోన్: చెరువు శిఖం భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఏఈ మధుకర్ అన్నారు. మండలంలోని గంజాల్‌లో సర్వే నంబరు 19లో 15.16 ఎకరాల ఒడిసెల కుంటను కొందరు ఆక్రమించుకుంటున్నారని మత్స్యకారులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. శిఖం భూములు ఆక్రమించుకున్నావారికి నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఇందులో ఎంసీ.ఖాదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరెడ్డి, లష్కర్లు సాయన్న, గంగాధర్, కిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు శిబిరం

నిర్మల్ రూరల్: ఆర్టిఫీషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు పరికరాల పంపిణీకి గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. 18 ఏళ్లలోపు వయసు కలిగి, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ది వ్యాంగ విద్యార్థులు ఈ శిబిరానికి అర్హులని పేర్కొన్నారు. వైద్యులు విద్యార్థులను పరీక్షించి, అవసరమైన పరికరాలను గుర్తించి, సంస్థకు తెలియజేస్తారని వెల్లడించారు. వాటిని తయారు చేయించి, మరొక శిబిరంలో ఉచితంగా అందజేస్తారని తెలి పారు. ఈ శిబిరానికి హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సదరం సర్టిఫికెట్ లేదా యూడీఐడీ కార్డు, సర్టి ఫికెట్ లేని వారు ప్రభుత్వ వైద్యుని దగ్గర సర్టిఫికెట్ తీసుకొని శిబిరానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

భైంసా ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వోగా శంకర్

భైంసాటౌన్: భైంసా అటవీశాఖ రేంజ్ అధికారిగా శంకర్ నియమితులయ్యారు. పట్టణంలోని అటవీశాఖ గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రమేశ్ రాథోడ్ బదిలీ కాగా, ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

'కడెం' లీకేజీలు అరికడతాం

- ఎస్ఈ రవీందర్



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. గురువారం రాత్రి వరకు ప్రాజెక్టుకు 1,770 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో, ఒక వరద గేటు ఎత్తి 3,850 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 696.325 అడుగులు ఉంది. ప్రాజెకును ఎస్ఈ రవీందర్ గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్ వరద గేట్ల లీకేజీలతో ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం లేదన్నారు. లీకేజీలను అరికట్టి రెండు పంటలకు నీరందిస్తామని తెలిపారు. ఆక్సిజన్ మాస్కుల తో సిబ్బంది వరద గేట్ల లీకేజీలకు గుర్తించారు.

స్వచ్ఛదనం–పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రోజువారీ ప్రణాళిక ప్రకారం వివిధ కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం వంటి విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులను సభ్యులుగా చేసి, క్షేత్రస్థాయిలో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వలన కలిగే



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్

అనర్థాలను తెలియజేసే విధంగా గోడలకు పెయింటింగ్స్ వేయించాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహించడం, నీటి శుభ్రత వంటి విషయాలపై రోజువారీ కార్యాచరణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మరుగుదొడ్లు లేని ఇళ్లు గుర్తించి నిర్మాణానికి 15 రోజుల్లో అనుమతులు ఇవ్వాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పటిష్టంగా కార్యక్రమం...

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీ ప్రణాళికల అమలుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ దనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విస్తృతస్థాయిలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరంతరం పారిశుద్ధ్య పనులు కొనసాగించాలన్నారు. ప్రజలందరినీ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. దోమలు పెరగకుండా నియంత్రించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన పెంచేలా విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో సీజనల్ వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వారిని ఖాళీ చేయించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జెడ్పీ సీఈవో గోవింద్, చీఫ్ ప్లానింగ్ అధికారి బాబురావ్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయిపై నిఘా పెంచాలి

- ఎస్పీ జానకీషర్మిల
- పోలీసు అధికారులతో క్రైమ్ మీటింగ్

నిర్మల్ రూరల్: జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలను ఉక్కుపాదంతో అణచివేయాలని ఎస్పీ జానకీషర్మిల పోలీసులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో గురువారం క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్నిస్థాయిల అధికారులు మరింత దృష్టి పెట్టాలన్నారు. బాధితుల ఫిర్యాదులకు వెంటనే స్పందించి, సత్వర న్యాయం చేస్తామని నమ్మకం, భరోసా కలిగించాలన్నారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలతోపాటు, రవాణా చేస్తున్న వారిపై దృష్టి పెట్టాలని, వారిపై కఠినంగా వ్యవహరించడంతోపాటు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతీ దరఖాస్తును తనిఖీ చేసి, విచారణ చేసి, ఎంక్వైరీ రిపోర్టును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

ఏర్పాటు చేసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణ కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతీ 15 రోజులకోసారి వారిని పిలిపించి మాట్లాడాలన్నారు. ప్రజావాణి పిటిషన్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ, సీసీఎస్‌బీ సీఐలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం

- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ సమంజసమే అని, ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పేదలకు న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని.. ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో కోట్లాది మంది దళితుల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం కొనసాగిన 3 దశాబ్దాల పోరాటాలు ఫలించిందని తెలిపారు.

సుప్రీం తీర్పు హర్షనీయం

భైంసాటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు



మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

హర్షనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని అన్నాబావుసాఠే విగ్రహం వద్ద గురువారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు అవసరమని సుప్రీం కోర్టు తెలుపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాయిచంద్, గడ్డం తుకారాం, షెల్కె ఆనంద్, గోనేకర్ శంకర్, బాబు గాడేకర్, నామత్కర్ దిగంబర్, సంజు, బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బయోసైన్స్ ఉపాధ్యాయులకు న్యాస్‌పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ సాధన సర్వే పరీక్ష(న్యాస్)ను ఎన్‌సీఈఆర్టీ నిర్వహిస్తోంది. ప్రస్తుత విద్యాసంవత్సరం 2024–25 నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షకు ఉపాధ్యాయులను సమయాత్తం చేయడంలో భాగంగా ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో పాఠశాల విద్యాశాఖ శిక్షణ ఇచ్చింది. అభ్యసన ఫలితాల ఆధారంగా బోధన చేస్తే విద్యార్థులు సులువుగా న్యాస్ పరీక్షలో ఉత్తీర్ణ సాధించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా న్యాస్ పరీక్ష నిర్వహణ, ప్రశ్నపత్రం తీరును వివరించారు. కార్యక్రమంలో బయోసైన్స్ రిసోర్స్ పర్సన్‌లు సత్యభామ, కవిత, కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వాల్గోట్ శ్రీనివాస్, కాంప్లెక్స్ బయోసైన్స్ టీచర్ సుష్మారాణి తదితరులు ఉన్నారు.

భైంసాలో టీచర్ రిలీవ్ హైడ్రామా..!

భైంసాటౌన్: ఓ మహిళా ఉపాధ్యాయురాలి రిలీవ్ విషయమై భైంసా పట్టణంలో హైడ్రామా జరిగింది. కుభీర్ మండలం బెల్‌గాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు దేవిక కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌కు బదిలీ కాగా, ఎంఈవో చంద్రకాంత్ నెలరోజులుగా రిలీవ్ చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. ఓ ఉపాధ్యాయ సంఘం నేత జోక్యం చేసుకోగా, రిలీవ్ ఆర్డర్‌పై సంతకం కోసం గురువారం పట్టణంలోని ఎంఈవో ఇంటికి వచ్చారు. ఎంతకీ బయటికి రాకపోవడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. రిలీవ్ చేయాలని పట్టుబట్టి ఇంటి బయటే వేచి ఉండడంతో ఎట్టకేలకు ఎంఈవో కుభీర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలోనే రిలీవ్ ఆర్డర్‌పై సంతకం పెడతానని చెప్పి కుభీర్ బయలుదేరి వెళ్లారు. అనంతరం ఆమెను రిలీవ్ చేశారు. వివాదానికి సంబంధించి 'సాక్షి' ఇరువురిని ఫోన్‌లో సంప్రదించగా, పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఇంతవర కు బాగానే ఉన్నా.. తన ఇంటికి వచ్చి తనను వేధించారని ఆరోపిస్తూ ఎంఈవో చంద్రకాంత్ ప ట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మహిళా ఉపాధ్యాయురాలు సైతం ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ వివాదం ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశం కాగా, పంచాయితీ డీఈవో వద్దకు వెళ్లినట్లు తెలిసింది. పరస్పరం పోలీసు ఫిర్యాదుల వరకు వెళ్లడంతో డీఈవో వద్ద రాజీ కుదిరినట్లు సమాచారం.

మొక్కలతోనే మనుగడ

నిర్మల్ రూరల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, పరిశుభ్రత, పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం చెట్లు ముఖ్యమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీసు ఆఫీసు భవన ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 1,42,000 మొక్కలు నాటామన్నారు. మరో 60 వేల మొక్కలు త్వరలో నాటుతామన్నారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈనాటి మొక్కలే రేపటి వృక్షాలన్నారు. భావితరాలకు ఆహారకరమైన వాతావరణాన్ని అందించడానికి వన మహోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపా రు. ఇందులో డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు నైలు, గోపీనాథ్, అశోక్, సురేందర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, మల్లేశ్, నవీన్‌కుమార్, ఆర్ఐలు రామ్ నిరంజన్, రమేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

తహసీల్దార్ వేధిస్తున్నారని సిబ్బంది నిరసన

కడెం: తహసీల్దార్ వేధిస్తున్నారని కడెం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మూకుమ్మడిగా మూడు రోజులు సామూహిక సెలవు పెట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం 13 మంది కార్యాలయ సిబ్బంది నిరసన తెలిపారు. కొద్ది రోజులుగా తహసీల్దార్ సుజాతరెడ్డి, డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, ఎంసీ, ఇతర సిబ్బందితో అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని, గిరిజనులైన తమను చిన్నచూపు చూస్తున్నారని డీటీ శంకర్, ఆర్ఐలు తక్కన్న, లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ నాగోరావు ఆరోపించారు. తహసీల్దార్ వేధింపుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా తాను వేధింపులకు పాల్పడలేదని, డ్యూటీ చేయమంటే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిరసనలో ఎంసీ ఉమాజీ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



నిరసన తెలుపుతున్న సిబ్బంది

క్లుప్తంగా

కేకులో పురుగులు

బోథ్: బర్త్ డే వేడుక కోసం యువకులు తీసు కెళ్లిన కేకులో పురుగులు వచ్చిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధన్నూర్(బి) గ్రామ యువకులు మంగళవారం తమ మిత్రుడి బర్త్ డే కోసం మండల కేంద్రంలోని ఓ బేకరీ షాపులో కేకు కొనుగోలు చేశారు. బాక్స్ తెరవగా కేకులో పురుగులు దర్శనమిచ్చాయి. యజమానిపై యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం తయారుచేసిన కేకును తమకు అంటగట్టారని మండిపడ్డారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పత్తి మొక్కలు తొలగించిన వ్యక్తిపై కేసు

నేరడిగొండ: చేనులో పత్తి మొక్కలు తొలగించిన ఘటనలో బుగ్గారం గ్రామానికి చెందిన రామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సవర్గాం గ్రామానికి చెందిన చౌహాన్ విలాస్ నేరడిగొండ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శివాలయం వద్ద రామారావు తన భార్యతో గొడవ పడుతున్నాడు. చౌహాన్ విలాస్ తన కారును నిలిపి ఎందుకు గొడవపడుతున్నారని అడగగా, నువ్వెవరు నాకు చెప్పడానికి అని దుర్భాషలాడాడు. ఇది మనస్సులో పెట్టుకొని రామారావు చౌహాన్ విలాస్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని సుమారు 75 పత్తి మొక్కలు తొలగించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో చోరీకి యత్నం



దొంగ కదలికలు సీసీ పుటేజీలో రికార్డు అయిన దృశ్యం

బాసర: మండల కేంద్రంలోని అక్షర కాలనీకి చెందిన దీక్షిత్ చందు మహారాజ్ ఇంట్లో చోరీకి దొంగ యత్నించాడు. ఆ సమయంలో దీక్షిత్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దొంగ ఇంట్లో చొరబడేందుకు యత్నించగా, సీసీ పుటేజీలో రికార్డు అయింది. గురువారం దీక్షిత్ అందించిన సమాచారంతో ఎస్సై గణేశ్ అక్కడికి వెళ్లారు. అప్పటికే ఎస్సై, గ్రామ యువకులను చూసి ఓ వ్యక్తి వెనుక నుంచి పారిపోయినట్లు గుర్తించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని వాడిగుడ రహదారిపై గురువారం బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. మాలన్‌గొందికి చెందిన మడావి రవి తలకు, చెవికి గాయమైంది. పలువురు గమనించి అతన్ని ఆటోలో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్ చేశారు.

డ్రైవర్.. దొంగ!

- అద్దె వాహనం తీసుకొని.. అందినకాడికి దోచేశాడు
- ఓ టీచర్ ఫోన్‌పే నుంచి రూ.94,500 డ్రా
- మరో వ్యక్తిది రూ.2వేల నగదు, అర తులం బంగారం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సెల్ఫ్ వాహనాలను అద్దెకు తీసుకొని అందినకాడికి దోచేస్తాడు ఓ ఘరానా మోసగాడు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన రాథోడ్ యువరాజ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో వేర్వేరు సమయాల్లో రెండు కార్లను అద్దెకు తీసుకొని నడిపించాడు. ఆ సమయంలో అందులో ప్రయాణించిన ఇద్దరు ఈయన చేతిలో మోసపోయారు. కాగా, నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

ఆదిలాబాద్‌లో సెల్ఫ్ డ్రైవ్ పేరిట ఓ టవేర వాహనాన్ని అద్దెకు తీసుకొని హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు పలువురు ప్యాసింజర్లను తీసుకొచ్చాడు. అందులో ప్రయాణికుడు జాదవ్ గణేశ్ పరిచయం అయ్యాడు. ఆయన కూడా వృత్తిరీత్యా డ్రైవర్ కావడంతో స్నేహం పెంచుకున్నాడు. రిమ్స్ ఆస్పత్రి దగ్గరికి వచ్చిన క్రమంలో తనకు తల తిరుగుతుందని, ఈ వాహనాన్ని అడ్డా వద్ద యజమానికి అప్పగించాలని, అప్పటివరకు తాను ఇక్కడే ఉంటానని నమ్మించాడు. ఆయన వద్ద ఉన్న పర్సు, బ్యాగు తనకు ఇవ్వమని, తాను జాగ్రత్తగా ఉంచుతానని నమ్మబలికాడు. అందులో రూ.2,500 నగదుతోపాటు 5 గ్రాముల బంగారం ఉంది. తాను తిరిగి వచ్చేసరికి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మే 31న చోటుచేసుకుంది. బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటినుంచి ఆయన పరారీలో ఉన్నాడు. ఇలా దొంగిలించిన సొమ్ములతో పల్సర్ బైక్‌ను కొనుగోలు చేసి జల్సాలు చేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, జూలై 2న సెల్ఫ్ డ్రైవ్ పేరిట షిఫ్ట్ వాహనాన్ని అద్దెకు తీసుకొని ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు ప్రయాణికులను తరలిస్తున్నాడు. ఉట్నూర్‌లో జాదవ్ మోహన్ అనే టీచర్ ఈ వాహనంలో ఎక్కాడు. ఆయన నుంచి ఆదిలాబాద్‌కు వచ్చినందుకు రూ.100 చార్జీ తీసుకున్నాడు. సదరు టీచర్.. కేసీబీ గార్డెన్ వద్ద దిగాడు. అయితే అతను కారులో ఫోన్ మరిచిపోయాడు. అయితే యువరాజ్ ఆ ఫోన్ లాక్‌ను ఓపెన్ చేసి తన నంబర్‌కి కాల్ చేసుకుంటాడు. ఆ నంబర్ మొదటి ఆరు అంకెలను ఫోన్‌పేలో నమోదు చేయడంతో ఓపెన్ అవుతుంది. ఆదిలాబాద్‌లోని ఎస్‌బీఐ సేవా కేంద్రంలో రూ.94,500 డ్రా చేశాడు. దీంతో బాధితుడి మరో ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో ఆయన కంగు తిన్నాడు. దీంతో మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. గత కొంత కాలంగా నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు గురువారం జిల్లా కేంద్రంలో ఆయన్ను పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన సెల్‌ఫోన్, పల్సర్ బైక్‌తో పాటు నిందితుడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుడిపై ఇదివరకు 5 వివిధ కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడిని పట్టుకున్న పోలీసులను అభినందించారు. అపరిచితులకు వాహనాలను అద్దెకు ఇవ్వొద్దని డీఎస్పీ సూచించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, టూటౌన్ పోలీసులు రమేశ్, నరేశ్, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, నరేందర్, కరీం, రామన్న పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో..

గుంతల రోడ్లు

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరింది. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రహదారి చేరి కంపు కొడుతోంది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



మున్సిపల్ చైర్మన్ ఇంటి వెనకాల..



ప్రియదర్శనగర్ నుంచి సాగర్‌కాలనీకి వెళ్లే రోడ్డు



ఎన్టీఆర్ మార్క్ భాగ్యనగర్ చౌరస్తాలో..

అయ్యో.. ఆరాధ్య..!

- విద్యుదాఘాతంతో చిన్నారి మృత్యువాత
- రైస్‌కుక్కర్ కేబుల్ నోట్లో పెట్టుకోవడంతో షాక్



ఆరాధ్య మృతదేహం

కడెం: రైస్‌కుక్కర్ కేబుల్ చిన్నారి పాలిట మృత్యుపాశంగా మారింది. నోట్లో పెట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. చిన్నారి మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం సుశీల, రాయలింగు దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు ఆరాధ్య(ఏడాదిన్నర) విద్యుత్ బోర్డుకు పెట్టి ఉంచిన రైస్‌కుక్కర్ కేబుల్‌ను నోట్లో పెట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరాధ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 'అయ్యో ఆరాధ్య ఎంత పనాయే..' అంటూ తల్లిదండ్రులు విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మెరుగైన విద్యనందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న కుష్బు గుప్తా

- ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా



విద్యార్థులకు ప్రశ్నలు అడుగుతున్న ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందరించాలని ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా అన్నారు. మండలంలోని పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. తరగతి, వంట గదుల్లో నీరు నిల్వ ఉండడం, భోజనం మెనూ పాటించకపోవడం, రిజిస్టార్‌లో హాజరు వేయకపోవడం, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంకి, ఎలాంటి అనుమతి లేకుండా సెలవు పెట్టిన పిట్టబొంగరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో స్వర్ణకారుడి ఆత్మహత్య



గంగాధర్ (ఫైల్)

ఖానాపూర్: అప్పుల బాధతో స్వర్ణకారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన స్వర్ణకారుడు బెజ్జారపు గంగాధర్, భార్య సంతోషి దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందులో పెద్దకూతురికి ఇటీవల పెళ్లి అయింది. పెళ్లి ఖర్చుల కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. బుధవారం సాయంత్రం ఆయన షాపులో యాసిడ్ తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా కుటుంబీకులు, స్థానికులకు తెలిపాడు. వారు అక్కడికి చేరుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనమేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భర్త గొంతునులిమి హత్యచేసిన భార్య అరెస్టు

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఈ ఘాతుకం
- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ రాంబాబు



వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ

దహెగాం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్టేషన్‌లో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన సుజాతకు దహెగాంకు చెందిన బండ మల్లేశ్‌తో గత 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు కుమార్తె ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. మల్లేశ్ ఇంటి పక్కన ఉన్న గుర్లె రాజు వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయ కూలీ పనికి సుజాత వెళ్తుండేది. ఈ క్రమంలో రాజుతో ఆరేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి విషయం గతేడాది భర్తకు తెలిసింది. మద్యానికి అలవాటు పడి భార్యతో జరిగిన గొడవలో మల్లేశ్‌కు గాయపడ్డాడు. నాలుగు నెలలుగా విడిపోయి ఉన్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఏకం చేశారు. అయినా సుజాతలో మార్పు రాలేదు. రాజుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయమై గతనెల 25న భార్యభర్తలు గొడవపడ్డారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా తొలగించుకోవాలని రాజు ప్రోత్సాహంతో గొంతు నులిమింది. తర్వాత కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తీసుకవచ్చారు. మాట రాకపోవడంతో గతనెల 28న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అన్నయ్య బండ సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుజాత, గుర్లె రాజుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య



గుర్తుతెలియని యువతి మృతదేహం

బాసర: బాసర గోదావరి నదిలో యువతి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజఈతగాళ్లతో బయటకు తీశారు. గోదావరి నది ఒడ్డున రూ.3 వేల నగదు, బ్యాగులో బంగారు గొలుసు, మెట్రో ఐడీ కార్డు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

చికిత్సపొందుతూ వివాహిత మృతి



జంగుబాయి మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని ఉమ్రి (బి) గ్రామానికి చెందిన వివాహిత మడావి జంగుబాయి (26) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతి చెందింది. ఎస్సై ఇమ్రాన్ కథనం ప్రకారం..మృతురాలి తల్లిదండ్రులు గత ఐదేళ్లక్రితం మృతి చెందారు. దీంతో బంధువులు అదే గ్రామానికి చెందిన మహాదుతో వివాహం జరిపించారు. జంగుబాయి కొన్నినెలలుగా మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో గతనెల 29న ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వారెవ్వా 'గుర్రపు' సవారీ



ఓ పెద్దాయన ఎంత దూరమైన గత మూడేళ్లుగా మహేగిరి రాజా (గుర్రం)పై ప్రయాణం చేస్తున్నాడు. ఆయనే ఆనంద్ వాగ్మారే. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా బోకర్ తాలూకా ఇలేగాం నుంచి నిర్మల్‌కు గుర్రంపై వచ్చాడు. ఆయన బంధువులు చికిత్స కోసం జిల్లాకేంద్రానికి వచ్చారు. గురువారం వారిని చూసేందుకు ఇలా గుర్రంపై రావడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. వాగ్మారే గుర్రపు సవారీ చేస్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అలంకారప్రాయంగా దోబిఘాట్



రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో జిల్లాకేంద్రంలోని పిట్టలవాడలో అధునాతన యాంత్రీకృత దోబిఘాట్ ఏర్పాటు చేసింది. రూ.20 లక్షలతో భవనం నిర్మించగా, మరో రూ.20 లక్షలతో బట్టలను శుభ్రంచేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అప్పట్లో మంత్రి హోదాలో ఈ భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా సేవలందక ఇప్పటికి అలంకారప్రాయంగానే ఉండటం గమనార్హం.



\- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీఆర్ఎస్, బీజేవైఎం నాయకులపై కేసు

చెన్నూర్: పట్టణంలో అనుమతి లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన 25 మంది బీఆర్ఎస్ నాయకులు, 8 మంది బీజేవైఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపట్టవద్దని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వీరభద్రరావు మృతి కారణమైన లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి ఓసీపీలో డ్రైవర్‌గా విధులు నిర్వహించే వీరభద్రరావు 2019, సెప్టెంబర్ 12న విధులు ముగించుకుని రెబ్బెన వస్తుండగా లారీ ఢీకొట్టింది. వీరభద్రరావు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదైంది. లారీడ్రైవర్ ఎండీ సలీంని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. అలాగే లారీ యజమానికి రూ. వెయ్యి జరిమానా విధించారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో బీట్ అధికారి, సభ్యులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో బైక్‌లపై అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. రేంజ్ అధికారి సుష్మారావు కథనం ప్రకారం.. ఊట్ల బీట్ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న డీఆర్వో పోచమల్లు, బీట్ అధికారి సాయికి బుధవారం రాత్రి కడెం ప్రధాన కాలువ సమీపంలో బైక్‌లు కనిపించాయి. అటువైపు టార్చిలైట్ వేయగా, కలప దుంగలను పడేసి బైక్‌లపై పారిపోయారు. మూడు సైజులు, 8 వాసాలు మొత్తం 0.421 సీఎంటీ కలప పట్టుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. వీటి విలువ రూ.33,844 ఉంటుందని పేర్కొన్నారు.

టేకుచెట్ల నరికివేత



స్మగర్లు వదిలేసివెళ్లిన టేకు దుంగ

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం, ఎలకేశ్వరం బీట్లలో స్మగ్లర్లు గొడ్డళ్లతో టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో అధికంగా టేకు ప్లాంటేషన్లు ఉన్న ఈ రెండు బీట్లలో నాలుగురోజుల క్రితం దాదాపు 10 చెట్లని తొలగించారు. ఫర్నిచర్‌కు అవసరమైన కర్రని తీసుకుని తరలించారు. అధికారుల రాకను గమనించి అవసరం లేని మిగతా చెట్టు బాగాలను అక్కడే వదిలి వెళ్లారు. గతంలో టేకు వనాల రక్షణకు ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులు తొలగింపుతో పర్యవేక్షణ కరువైంది. కాగా, భీమారం, ఎలకేశ్వరం తోపాటు దాంపూర్ సెక్షన్‌లో టేకు చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకుని టేకు ప్లాంటేషన్లని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.